భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
మంగళవారం 5 మార్చి 2024



వేసవి ముంచుకొస్తున్నది . మార్చినెల ప్రారంభంలోనే ఎండ మండు వేసవిని గుర్తు చేస్తున్నది. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు లేకపోయినా మండు వేసవిని అధిగమించటానికి కావలసిన కార్యాచరణ అటు అధికారుల్లోనూ, ఇటు పాలకుల్లోనూ కానరావడం లేదు. ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీలు అధీనంలో ఉన్న రక్షిత నీటి పథకాలు దాహార్తిని తీర్చే పరిస్థితిలలో కనిపించడం లేదు. ఇప్పటికే శివారు గ్రామాలకు ట్యాంక్‌ల ద్వారా అందిస్తున్నారు. ఎక్కడికక్కడే గ్రామాలలో ఆర్వోప్లాంట్‌లు ఉండటంతో తాగునీటిని ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. తాగునీటి పరిస్థితులపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

వేసవి గట్టెక్కేనా!

కనిపించని కార్యాచరణ



తాడేపల్లిగూడెం పట్టణానికి నీరందించే పంపుల చెరువు

ఆంధ్రజ్యోతి పరిశీలన

వేసవికి ముందే తాగునీటికి కటకట

ఇప్పటికే సరఫరా సమయంలో కరెంట్ కోతలు

అమృత్ పథకం పనుల్లో జాప్యం

గ్రామాల్లో పూర్తిగా నిండని చెరువులు

చాలా గ్రామాలకు ట్యాంకర్ల నీరే గతి

భీమవరం, మార్చి 4 : వేసవి వస్తుందంటే చాలు పట్టణాల్లోని అనేక ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదంటూ జనం గగ్గోలు పెడుతుంటారు. కుళాయిల్లో నీరు వచ్చే సమయం తగ్గిపోవడం, నీటి విడుదల సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూంటాయి. వేసవిలో మంచినీటి ట్యాంకర్ల కోసం ముందస్తుగానే టెండర్లు పిలుస్తూ ఉంటారు.గోదావరి జలాలతో ప్రవహించే కాలువలు ఉన్నప్పటికీ ఆ నీటిని శుద్ధి చేసే యంత్రాల్లో తలెత్తుతున్న లోపాల కారణంగా నీటి సరఫరా సరిపడినంత అందడం లేదు. భీమవరం తాడేపల్లిగూడెం పట్టణాల్లో కోట్ల రూపాయలతో అమృత్ పథకం పనులు చేపట్టినా పూర్తికాని పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. అనేక గ్రామాల్లో మంచినీటి పథకాలు ప్రజలకు సరిపడినంత మంచినీరు అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో సమీపంలోని పట్టణాల నుంచి ట్యాంకర్లు ద్వారా నీరు అందిస్తున్నారు.

రెండుపూటలా కోతలు

తాడేపల్లిగూడెం అర్బన్ : వేసవిలో తాడేపల్లిగూడెం పట్టణంలో వేసవి తాగునీటి కష్టాలు తప్పేట్టు లేదు. ఇప్పటికే కరెంట్ కోతలు విధిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన అమృత నిధులనే ఇప్పటికి వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఓవర్ హెడ్ రిజర్వాయర్లను నిర్మించారు. నీటి శుద్ధి ప్లాంట్‌లకు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వంలో తాగునీటిపై ఏమీ పట్టించుకోవడం లేదు. తాడేపల్లిగూడెంలో రెండు పూటలా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. ఏలూరు కాలువలో అడ్డుకట్ట వేసి మిగిలిన జలాలను మళ్ళించడం ద్వారా ప్రజలకు నీరు అందించేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి రూ.6 లక్షలు మంజూరయ్యాయని పనులు కాలువలు నిలిపి వేసిన అనంతరం ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే పంపుల చెరువు నుంచి కొన్ని రోజుల పాటూ నీరందించనున్నారు. అయితే ఇవి కూడా ప్రజల దాహార్తి తీర్చేందుకు సరిపోయేలా లేవు. పట్టణంలో ఇప్పటికే 16, 18వ వార్డులలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్‌ట్యాంక్‌ల ద్వారా నీటిని సప్లయ్ చేస్తున్నారు. పంపుల చెరువులో ఇప్పటికి 15.6 నీటి మట్టం ఉంది. అయితే వేసవి ఎండలు ముదిరితే ఈ చెరువులో నీరు చాటా మట్టుకు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఫలితంగా వేసవిలో పట్టణ వాసులకు తాగునీటి ఎద్దడి తప్పేలా లేదన్న ఆందోళన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.



భీమవరం ఎస్‌టి కాలనీలో నీరు నింపుకునేందుకు సిద్ధంగా ఉంచుకున్న డ్రమ్ములు

గ్రామాల్లో రోజు విడిచి రోజు

నరసాపురం : మండలంలోని లక్ష్మణేశ్వరం, రుస్తుంబాద, తూర్పుతాళ్ళు మంచినీటి ప్రాజెక్టులు ఉన్నాయి. తీరంలోని 18 గ్రామాలకు ఈ ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. పంట కాల్వలు కట్టేసే నాటికి ఈ చెరువుల్ని పూర్తిస్థాయిలో నీటిని నింపి వేసవి ముగిసే వరకు రోజు విడిచిరోజు నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు ప్లాన్ రెడీ చేశారు. ఇటు పంచాయతీ చెరువులను పూర్తిస్థాయిలో నింపి ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మూడు ప్రాజెక్టుల్లో నీటి తోడకం మొదలుపెట్టారు.ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మునిసిపాల్టీ ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. పంట కాల్వ కట్టేసే సమయానికి మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నీటిని నింపుతున్నారు.వేసవిలో రెండు పూటలా నీటిని సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు ఉదయం సరఫరా సమయంలో అర గంటపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని నిర్ణయించారు. అవసరమైతే సాయంత్రం సమయంలో అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి అన్ని ప్రాంతాలకు నీరివ్వాలని యోచిస్తున్నారు. పట్టణ పరిధిలో మొత్తం 9,600 మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 87 లక్షల లీటర్లు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తుంది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో వున్న చెరువు 40 రోజులపాటు నీటిని అందిస్తుంది. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు.



తూడుతో నిండి ఉన్న వీరవాసరం పీర్లకోడు చెరువు



ఆకివీడులో ట్యాంకరు వద్ద క్యూలో ఉన్న మహిళలు

ఇంకా చెరువులు నిండలేదు

వీరవాసరం : వీరవాసరం మండలంలోని 23 గ్రామ పంచాయతీలకుగానూ అండలూరు గ్రామంలో సమగ్ర రక్షిత నీటిసరఫరా పథకం ద్వారా 18 నివాసిత ప్రాంతాలకు నీటిసరఫరా సాగుతుంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామంలోని రెండు సీపీడబ్ల్యుఎస్ పథకానికి సంబంధించిన రెండు చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపారు. చెరువులపై ఆధారపడి పనిచేసే రక్షిత నీటి సరఫరా పథకాల చెరువులలో నీరు ప్రస్తుతం అంతంత మాత్రంగానే ఉంది. కాలువలు మూసివేసే నాటికి వీటిని వేసవి అధిగమించటానికి పూర్తిస్థాయిలో నీటితో నింపాల్సి ఉంది. ఏప్రిల్ మొదటి వారానికి గాని ఈ చెరువులలో నీరు నిండే సూచనలు లేవు. వీరవాసరం , పెర్కిపాలెం, నందమూరుగరువు , దూసనపూడి, మత్స్యపురిపాలెం, బాలేపల్లి, మెంటేపూడి, బొబ్బనపల్లి, మత్స్యపురి, గ్రామాల్లోని చెరువులు నీటితో నింపాల్సి ఉంది. వీటికి మరమ్మత్తులు గాని, తూడు తొలగించే చర్యలు గాని కనిపించడం లేదు. మత్స్యపురిలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ నిధులతో నిర్మించిన ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ పంపింగ్ స్కీం ఉన్నప్పటికీ అది కేవలం గ్రామానికి మాత్రమే పరిమితం అయ్యింది. వీరవాసరంలో తూర్పుచెరువు, ఎల్లమ్మచెరువు, పీర్లకోడు(సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు) చెరువులు నీటితో నింపాల్సి ఉండగా పీర్లకోడు చెరువు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. రాయకుదురులో రక్షిత నీటి పథకానికి నీరు అందించాల్సిన చెరువు దశాబ్దకాలంగా అందుబాటులో లేదు.

పాలకొల్లు శివారులో నీటి ఎద్దడి

పాలకొల్లు టౌన్ : పాలకొల్లు పట్టణం శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి మొదలైంది. దీంతో శివారు ప్రాంత ప్రజలకు తాగునీరు పూర్తిగా అందక ఇబ్బందులు పడు తున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా తాగునీరు ఆరాకొరా సరఫరా చేయడంతో శివారు ప్రాంతాల ప్రజలు దూరంగా ఉన్న పట్టణ వాటర్ స్కీమ్ వద్దకు వచ్చి నీటిని తీసుకు వెళు తున్నారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజ్‌కుమార్‌ను అడగ్గా వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాల్వ ముగింపు సమయంలో క్రాస్ బండ్లు వేసి చెర్వుల్లో నీటిని నింపేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయండి

భీమవరం టౌన్ : ఈ వేసవిలో మునిసిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోతే పట్టణంలో మంచినీ ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పట్టణ పరిధి పెరిగింది. అమృత్ పథకంలో కొత్త రిజర్వాయర్లు వినియోగంలోకి వేస్తే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలు సరిపోవనే అంచనాలు వేస్తున్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా మునిసిపాల్టీకి ఉన్న రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులతో పాటు జీఅండ్‌వీ కెనాల్‌లో అడ్డుకట్ట ద్వారా 60 రోజులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీరు అందిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 16 లక్షలతో అడ్డుకట్ట వేసేందుకు టెండర్లు పిలిచామని అధికారులు తెలిపారు. గొల్లవానితిప్పరోడ్డు వెంబడి ఉన్న కాల నీలు, ప్రకాష్ నగర్, రామలక్ష్మణ నగర్ బలుసుమూడి, కొమరాడ రోడ్డు. బీసీ కాలనీ, ఏఎస్‌ఆర్ నగర్ శివారు ప్రాంతాలు, ఆరేటిన గర్, ఉండి రోడ్డు, దుర్గాపురం, లంకపేట, నర్సయ్య అగ్రహారం, మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, బ్యాంకు కాలనీ, యనమదుర్రు కాలువ గట్టు తదితర ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు ఉన్నాయి. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మంచినీరు సరఫరా చెయ్యాలనే ఉద్దేశ్యంతో అధికారులు ఈనెల 15 నుంచే ఉదయం గంటపాటు విద్యుత్ సరఫరా నిలుపుదల చెయ్యాలని ఇప్పటికే మునిసిపల్ అధికారులు ట్రాన్స్‌కో ఎస్‌ఈకి లేఖ రాశారు.

ఏడాది పొడవునా ట్యాంకర్ల నీరే గతి

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో నేటికీ కొన్ని ప్రాంతాల్లో పైపులైన్లు వేయకపోవడంతో ఏడాది పొడవునా ప్రతీరోజూ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయాల్సిందే. తెలగపాముల వీధి, ఎఫ్‌సీఐ, అయి-భీమవరం రోడ్డులో, జవహార్‌పేట, శారదా కాన్వెంట్ వీధి, పెద్దపల్లి వీధి, క్యాబిన్ రోడ్డు, సమతానగర్ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ఎప్పుడూ ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పంపిస్తున్నారు. పంచాయతీ దశలో ఉండగా నాల్గు ట్యాంకులు మంజూరయ్యాయి. నగర పంచాయతీ అయిన తరువాత వాటిని పట్టించుకోలేదు. ధర్మాపురం అగ్రహారం, తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన ఫిల్టర్‌బెడ్లలో ఇసుక మార్చవలసి ఉంది. కొన్నిచోట్ల ఫిల్టర్‌బెడ్లు, సంపులు క్లీన్ చేయకపోవడంతో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

తణుకు : పట్టణంలోని 8 ప్రాంతాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా లేదు. కొన్ని వార్డుల్లో మాత్రమే పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ, కొండాలమ్మ పుంత, పైడిపర్రు బైపాస్ ఏరియా, ఇరగవరం కాలనీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు రూ.35 లక్షలతో ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిలో బోర్ల మోటార్ల మరమ్మతులు, జనరేటర్ల అద్దె, చేతిపంపుల మరమ్మతులు ఉన్నాయి. వీటితో పాటు అదనంగా మరో ట్యాంకరును అద్దెకు తీసుకోనున్నారు.

శిథిలస్థితిలో వాటర్ ట్యాంక్

ఇరగవరం : సూరంపూడిలో ఏళ్ల తరబడి తాగు నీటి సమస్య వేధిస్తున్నది. గ్రామంలో 2002లో నిర్మించిన వాటర్ ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరి విరిగిపోయాయి. దీంతో ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు వీలు లేకుండా పోయింది. కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. సుమారు రెండు వేల మంది జనాబా వున్న ఈ గ్రామంలో ఒక్క ట్యాంక్ మాత్రమే ఉండడంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మెట్లు విరిగిపోయిన దృశ్యం

టెన్త్ హాల్ టిక్కెట్ల జారీ

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 :పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ www.bse.ap.gov.in వెబ్ సైట్‌లో లభించునని పాఠశాల విద్య డైరక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలో అన్ని ప్రభుత్వ /జిల్లా పరిషత్ / ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వారి పాఠశాల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ల ద్వారా హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష రాసే అభ్యర్థులకు అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలియజేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 50 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 16,800 మందికి 16,341 మంది హాజరవగా 459 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,973 మందికి 1,766 మంది హాజరవగా 207 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి కాపీయింగ్ ఇబ్బందులు గాని పరీక్షా కేంద్రాలలో తలెత్తలేదని ఎగ్జామ్స్ కన్వీనర్ చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

సోషల్ మీడియా వదంతులు నమ్మవద్దు : కొత్తపల్లి



నరసాపురం, మార్చి 4: జనసేన అభ్యర్థుల జాబితాను మరో మూడు, నాలుగు రోజుల్లో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటిస్తారని అప్పటివరకూ సోషల్ మీడియా, కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వదంతులని నమ్మవద్దని జన సైనికులకు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు విజ్ఞప్తి చేశారు.సోమవారం రాత్రి ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలలో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. రేపు, ఎల్లుండల్లో అభ్యర్థుల జాబితాను ఎట్టి పరిస్థితుల్లో ప్రకటించే అవకాశం లేదన్నారు. అప్పటి వరకూ పార్టీ శ్రేణులు ఎటువంటి ఊహాగానాలను నమ్మవద్దన్నారు. యర్రంశెట్టి బాబులు, వన్నెంరెడ్డి శ్రీను, గుగ్గిలపు మురళీ, నాగు తదితరులు పాల్గొన్నారు.

పంచేవాడినే.. వంచండి!



వలంటీర్లతో వైసీపీ నేతల క్రీడ

వారి విధుల్లోకి వీరే పరకాయ ప్రవేశం

సంక్షిప్త సందేశాల నుంచి పంపిణీల వరకు పెత్తనం

ఎన్నికల ముందే సీన్‌లోకి వైసీపీ

కీలక నియోజక వర్గాల్లో వక్ర ఎత్తుగడలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికలకు కొద్దిరోజులే మిగిలివుండగా, ఏదో రూపంలో ఓటర్లను తమదారికి తెచ్చుకునేందుకు ఇప్పటి నుంచే అధికార వైసీపీ ఎత్తుగడలు వేస్తోంది. బెదిరింపులకు దిగుతోంది. ఏదో రూపంలో తమ లక్ష్యాన్ని అందుకునేందుకు తాపత్రయపడుతోంది. ఆది నుంచి వలంటీర్ల వ్యవస్థపై వైసీపీయేతర పక్షాలన్నీ అనుమానాలు వ్యక్తం చేస్తూనే వున్నాయి. ఓటర్లను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి వలంటీర్లను ఒక అస్త్రంగా వాడుకోవడానికి వెనుకాడడం లేదు. ఎమ్మెల్యేలే కాదు.. ఆఖరికి నియోజకవర్గ ఇన్‌చార్జిలు పార్టీ హోదాలోనే పెత్తనం చేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఓటర్ల జాబితా సవరించినప్పుడు తగ్గట్టుగా నమోదుకు ఓటర్లు సిద్ధపడినా, ఇప్పటికీ జాబితాలోకి ఆ పేర్లు చేరలేదని చెబుతున్నారు. జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేయడానికి ఏ ఒక్కరూ సిద్ధపడకపోవడంతో ఈ వ్యవహారం ఎక్కడికక్కడ మరుగున పడుతూనే వచ్చింది. గ్రామ స్థాయిలో ఇప్పటికే ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందే వారందరినీ వలంటీర్లు ఎప్పుడో గుప్పెట పెట్టుకున్నారు. తెలుగుదేశం అనుకూలరైతే ఇప్పటికైనా మారండి.. పథకాలన్నీ వైసీపీ అధికారంలో వున్నా మీకు కూడా అందాయి. అంటూ తెలిసినవారికి మౌఖికంగా చెబుతూనే వస్తున్నారు. జగనన్న కాలనీలు ఏర్పాటైనపుడు అప్పటికే టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులుగా వున్నవారిని అదిలించి బెదిరించి టిడ్కో ఇళ్ల సంగతి పక్కనబెట్టండి.. కాలనీల్లో స్థలం తీసుకోండంటూ ఒత్తిడి చేశారు. ఇదంతా కొంత మంది వైసీపీ ముసుగులో వున్న వలంటీర్లు చేస్తున్న పనే. వివిధ పథకాల్లో ఎవరినైనా చేర్చాలంటే ఎమ్మెల్యేతో పనే లేదు. కేవలం వలంటీర్లు, గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థలో వున్న వారంతా ఓకే అంటేనే ఎవరికైనా పనైనట్లే. ఇప్పుడిది కాస్తా వెర్రితలలు వేసి వైసీపీ అనుకూల ప్రచారానికి దారి తీస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే వలంటీర్లందరినీ వైసీపీ సర్కార్ ఆకాశానికెత్తేసింది. అంతా మీకే సాధ్యమంటూ వారందరినీ కార్యకర్తలుగా మార్చేసింది. కొందరికి ఇష్టమున్నా లేకపోయినా,

వైసీపీ ఆదేశాలు తూచా తప్పకుండా క్షేత్ర స్థాయికి చేరుతున్నాయి. ఓటరు నమోదు దగ్గర నుంచి పింఛన్ పంపిణీ వరకు ఇంతకుముందు బాధ్యతగా వ్యవహరించిన వలంటీర్లలో కొందరిని హైజాక్ చేశారు. వలంటీర్ల చేతుల మీదుగా ఇవ్వాల్సిన వాటిని వైసీపీ నేతలే ఫొటోలకు ఫోజులిచ్చి మరీ పంపిణీ దిగుతున్నారు. పాలకొల్లు నుంచి ఎమ్మెల్యే రామానాయుడు టీడీపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా ఈ నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి అన్నింటా జోక్యం చేసుకుంటున్నారు. స్థానిక నేతలైతే వారే అంతా తామన్నట్లుగా పంపిణీకి దిగుతున్నారు. వైసీపీకి దూరంగా వుంటున్న వారిని బెదిరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తన నియోజకవర్గంలో జరుగుతున్న తాజా సీన్‌పై ఎమ్మెల్యే రామానాయుడు సోమవారం పశ్చిమ గోదావరి స్పందనలో ఫిర్యాదు చేశారు. మరికొందరు టీడీపీ ఇన్‌చార్జులు దీనికి సంబంధించి ఆధారాలు, వీడియో ఫుటేజ్‌లతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు. కొందరు వలంటీర్లు తమ గ్రూపుల్లో తెలుగుదేశం వ్యతిరేక ప్రచారం ఆరంభించినట్లు చెబుతున్నారు. పాలకొల్లే కాదు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, తణుకు, ఆచంట వంటి నియోజక వర్గాల్లోనూ ఇలాంటి పరిస్థితే కొనసాగుతోంది. వైసీపీ అధికారంలో వుంటేనే అన్ని సవ్యంగా వుంటాయని, లేదంటే టీడీపీ వస్తే అన్నీ గోవిందా అన్నట్టుగా ప్రచారం చేస్తూ ఓటర్లను నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నట్టు టీడీపీ ఇప్పటికే ఆందోళన చెందుతోంది.

ఇంకా ముందుందు ..

ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఒకవైపు ఓటర్లు వైసీపీకి వ్యతిరేకంగా వుంటే వారిని లొంగదీసుకోవడానికి ముందుందు వలంటీర్ వ్యవస్థనే వాడుకోనున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇప్పటికే కొన్ని నియోజక వర్గాల్లో శృతిమించి కనిపిస్తోంది. మరికొన్ని నియోజకవర్గాల్లో ఎవరింట్లో ఎన్ని ఓట్లున్నాయి...వారంతా ఏ పార్టీకి చెందినవారు.. నగదుకు లొంగుతారా... లేకుంటే బెదిరింపులతో దారికి తెచ్చుకోవచ్చా.. అనే కోణంలోనే ఎత్తుగడలకు పదును పెడుతున్నారు. కొన్ని నియోజక వర్గాల్లో తెలుగుదేశం దూసుకుపోతుండగా, ఆయా నియోజక వర్గాల్లో రాజకీయంగా కొన్ని వర్గాలకు గండి కొట్టడమే కాకుండా ఎంత వీలైతే అంతమేర తమ గుప్పెటలో నుంచి చేజారకుండా జాగ్రత్తపడుతున్నారు. ఇప్పటికే సామాజిక వర్గాలపరంగా ఓటర్లను జల్లెడ పడుతున్నారు. జనసేన అనుకూలురు ఆ పార్టీవైపు పైకి మొగ్గు చూపినా అంతర్గతంగా తమ డైరెక్షన్‌లోనే పనిచేసేలా గ్రామస్థాయిలో ఇంకో వ్యూహం సిద్ధం చేస్తున్నారు. వీటి వెనుక కూడా గ్రామ సచివాలయాలు వలంటీర్ల మద్దతుతోనే పని పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'మేం చేయాల్సిందంతా చేస్తాం.. మా పార్టీ గెలవాల్సిందే.. ఎంతిచ్చామని కాదు... ఇప్పటివరకు మేం చేసిన సేవను చూసైనా మాకు ఓటేసేందుకు అందరూ సిద్ధం కావాల్సిందే..' ఇది వైసీపీ నేతల అంతర్మఖంగా కనిపిస్తోంది. ముందుందు మరింత తెగింపుతో ముందుకెళ్తారనే భావన అందరిలోనూ వుంది.

వైసీపీ నేతలతో పింఛన్ల సొమ్ము పంపిణీనా ?

అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన

కలెక్టర్‌కు ఎమ్మెల్యే నిమ్మల అల్టిమేటం



పాలకొల్లు/భీమవరం టౌన్, మార్చి 4 : పాలకొల్లు నియోజకవర్గంలో పలుచోట్ల వలంటీర్లకు బదులుగా వైసీపీ నేతలే పింఛన్లు పంపిణీ చేయడంపై స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. ఈ మేరకు 'వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. వైసీపీ నాయకులు పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు పంచుతూ ప్రచారం చేశారు. దీనిపై ఎమ్మెల్యే నిమ్మల సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులైన మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోక పోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు.

బుకీలపై నిఘా

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

నరసాపురం, మార్చి 4: క్రికెట్, ఎన్నికల బెట్టింగ్‌లపై పోలీస్ బాసులు సీరియస్‌గా తీసుకున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కాయ్ రాజా కాయ్ కథనంపై పోలీస్ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం, ఎన్నికల సమీపిస్తున్నందున్న పెద్ద ఎత్తున బెట్టింగ్‌కు అవకాశం ఉండటంతో వీటిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచా లని ఆదేశాలు జారీచేశారు. ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా రంగంలోకి దిగి బెట్టింగ్‌లపై ఆరా తీస్తున్నారు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం ప్రాంతాల్లో ఎక్కువగా బెట్టింగ్‌లు జరుగుతు న్నందున బుకీలపై నిఘా పెట్టారు.వారి కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ పేట్రేగిపోయింది. హైద్రాబాద్, బెంగళూరుల్లో ఉంటూ బుకీలు దందా నడిపిస్తు న్నారు. కొంతమంది ఏజెంట్లను పెట్టుకుని వారి ద్వారా సొమ్ము వసూలు చేస్తున్నారు. అయితే కొత్త ఎస్పీ దీనిపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

వెల్లువలా సమస్యలు

స్పందనలో బారులు తీరిన జనం

భీమవరం టౌన్, మార్చి 4 : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనకు సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి కలెక్టరు సుమిత్‌కుమార్ గాంధీకి 228 వినతులను స్వీకరించారు. వీటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. స్పందన ఉదయం 10 గంటలకే మొదలవుతుందని అధికారులు సమయానికి తప్పక హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నా రాయణరెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాదుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి అప్పారావు పాల్గొన్నారు.



సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కాలనీలో ఇళ్ళకు రోడ్డు లేదు




పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు ఎంపీపీ స్కూల్ ఎదురుగా ఉన్న కాల నీలో లేఅవుట్ మార్పు చేసి పట్టాలు ఇవ్వడం వల్ల మొదటి వీధిలోని కొన్ని ఇళ్లకు రోడ్డు లేకుండా పోయిందని గ్రామానికి చెందిన చంద్రావతి ఫిర్యాదు చేశారు. సుమారు 20 మంది మహిళలు వినతిపత్రం ఇచ్చి మొరపెట్టుకున్నారు.

సాగునీరు అందేలా చర్యలు తీసుకోండి



శివారు భూములకు సాగునీరు అందడం లేదంటూ పోడూరు మండలం వద్దిపర్రు రైతులు ఫిర్యాదు చేశారు. సిద్ధాంతం బ్యాంకు కెనాల్‌లో నీరు పుష్కలంగా ఉందని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్‌కు 70 శాతం వరకు నష్టపోయామని దాళ్వాలో ప్రస్తుతం 60 ఎకరాలకు సాగునీరు అందడం లేదని నాలుగవ వార్డు సభ్యుడు గంగూరు నాగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆచంట వేమవరం బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు ఇప్పించాలని కోరారు.

అవకతవకలపై చర్యలు తీసుకోండి



గొల్లలకోడేరు గ్రామపంచాయతీలో వాటర్ నిర్వహణకు కాంట్రాక్టు టెండర్లు పిలిచారని తక్కువ కొటేషన్ ఇచ్చిన వారి కంటే ఎక్కువ కొటేషన్ ఇచ్చిన వారికి బాధ్యతలు అప్పగించారని విచారణ చేసి న్యాయం చేయాలని వల్లూరి బాలకృష్ణ కోరారు.



ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు
8న మహాశివరాత్రి
దొడ్డిదారిన బదిలీల ఉత్తర్వులు సిద్ధం
5

హరహర మహాదేవ

8న శివరాత్రి.. ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు



ముస్తాబవుతున్న ఆచంటేశ్వరుడి ఆలయం

శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసేందుకు అర్చకులు సిద్ధమవుతున్నారు.

ఆచంటేశ్వరుడి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆచంట, మార్చి 4: ఈ నెల ఆరు నుంచి పది వరకు జరిగే రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, బయట విద్యుత్ దీపాలతో ప్రత్యేకగా అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ టి.సాగర్, ఆలయ అధికారి రాము, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఆరున స్వామికి ప్రత్యేక పూజలు, దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏడున వేకువ జామున



లక్ష్మణేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లు

స్వామి, అమవార్ల కల్యాణం, ఎనిమిదిన మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలతో స్వామి రథోత్సవం నిర్వహిస్తారు. తొమ్మిదిన స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం, పదిన స్వామికి త్రిశూలోత్సవం, సాయంత్రం భక్తులకు అమ్మవారి కుంకుమ భరిణలు పంపిణీ చేస్తారు.

లక్ష్మణేశ్వరుని ఆలయం ముస్తాబు

నరసాపురం రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతుంది. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో భారీ పందిర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు సిద్ధం చేశారు. దక్షణ కాశీగా పేరొందిన లక్ష్మణేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఉభయగోదావరి, కృష్ణా జిల్లా వాసులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివస్తారు. సుమారు 50 వేల మందిపైగా ఈ ఆలయాన్ని ప్రతి ఏటా దర్శించుకుంటారు. దానికి అనుగుణంగా ఆలయ కమిటి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

పోలవరం, మార్చి 4 : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల చివరి సమీక్షా సమావేశం మంగళవారం పట్టిసీమ ఫెర్రీ పాయింట్ వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఆధ్వర్యంలో జరుగుతుందని డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు తమ కార్యాచరణ ప్రణాళికలతో ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజా రవాణాశాఖ అధికారి



ఏలూరు రూరల్, మార్చి 4: మహా శివరాత్రికి ప్రజా రవాణా సంస్థ మార్చి 8న శైవ క్షేత్రదర్శనానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎన్వీఆర్ వర ప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏలూరు నుంచి బలివేకు 50, జంగారెడ్డిగూడెం నుంచి తాడువాయి, పట్టిసీమకు 30 బస్సులు, నూజివీడు నుంచి బలివేకు 20 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏడాది ఏలూరునుంచి ద్వారకా తిరుమల వెళ్లే సాయిభక్తులకు ద్వారకాతిరుమల నుంచి ఏలూరుకు 25 బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బస్సులు 7 నుంచి 9వరకు నడపనున్నట్లు తెలిపారు.



ధ్వజస్తంభం వద్ద నిర్మించిన తాటాకు పందిళ్లు

నేటి నుంచి కల్యాణోత్సవం



ద్వారకా తిరుమల : క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మ వార్లను పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేస్తారు. 6న పంచగవ్య ప్రాశన, అంకురార్పణ, ధ్వజారోహణ, 7న గామోత్సవం, 8న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని లింగోద్భవ కాల అభిషేకం, అనంతరం స్వామి దివ్య కల్యాణ మహోత్సవం జరగనున్నాయి. 9న గ్రామోత్సవం, 10న త్రిశూలవారి వసం తోత్సవం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, 11న శ్రీపుష్ప యాగో త్సవం జరుగుతాయని ఈవో త్రినాథరావు వివరించారు.

7న కలశ స్థాపనతో వీరంపాలెంలో ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4: వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి పంచాయతన క్షేత్రంలో శివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. అదే రోజు భూప్రస్తార శ్రీచక్రార్చన శివరాత్రి రోజున స్పటికలింగ స్వామికి మానస సరోవర జలం, 12 నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. మహాదేవునికి మహా కుంభాభిషేకం, ప్రముఖులచే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన, లింగోద్భవకాల అభిషేకం, లక్ష జ్యోతి ప్రజ్వలన చేయనున్నారు. శివరాత్రి రోజు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ప్రతీ ఐదు నిముషాలకు తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సుల సదుపాయం కల్పించామని ఆర్టీసీ డీఎం వైసత్యనారాయణమూర్తి తెలిపారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిధుల దుర్వినియోగంలో విచారణ చేయాలి



తహశీల్దారుకి వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

పోలవరం, మార్చి 4 : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన నిధులు దుర్వినియోగం చేసి, అవినీతికి పాల్పడిన మత్స్య శాఖ అధికారులపై, అక్రమంగా రుణం పొందిన వ్యక్తిపై సమగ్ర విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలని గోదావరి బోట్స్ మెన్ అండ్ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద అవినీతిపై విచారణ చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు ధర్నా చేసి, నినాదాలు చేశారు. డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పీఎం మత్స్య సంపద యోజనలో 2021-2022లో 40 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సంబంధం లేని ఒక సామాజిక వర్గం వ్యక్తికి రూ.23 లక్షల నిధులు మంజూరు చేశారని, ఎస్సీ ఎస్టీలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని దరఖాస్తు సమయంలో మత్స్యశాఖ అధికారులు నమ్మబలికి ఇప్పుడు మత్స్యకారులకు సంబంధం లేని వ్యక్తికి ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. అక్రమ మార్గంలో రుణం పొందిన, మంజూరు చేసిన, సహకరించిన మత్స్యశాఖ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు నాలుగు చక్రాల వాహనాలకు రుణాలిప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం మత్స్యకార సొసైటీ సభ్యులు మత్స్యకారులు పాల్గొన్నారు.

గోల్డ్‌బాండ్ స్కీమ్‌లో 6.10 కేజీల బంగారం డిపాజిట్



బంగారం ప్యాక్‌ను ఎస్‌బీఐకు అప్పగిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 4: చిన్న తిరుమలేశుడికి భక్తులతో లభించిన 6.10 కేజీల బంగారాన్ని గోల్డ్ బాండ్ స్కీమ్‌లో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు అప్పగించారు. స్వామి వారికి హుండీల ద్వారా వచ్చిన బంగారు మిశ్రమం, కానుకలని ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ముందుగా స్వామివారి ఆలయ స్ట్రాంగ్ రూములో ఉంచిన వీటిని అధికారుల సమక్షంలో తూచి సీల్‌వేసి ఎస్‌బీఐ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ కమిషనర్, ఇంచార్జి ఆర్‌జేసీ విజయరాజు, దేవాదాయశాఖ గోల్డ్ అప్రైజర్, ఏసీ దుర్గాభవాని, ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి అలహసింగరాచార్యులు, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ రమణరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ సుబ్రమణ్యం

పెంటపాడు, మార్చి 4: చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం పెంట పాడు పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పల్స్ పోలియో కార్యక్రమం నమోదు శాతంపై ఆరా తీశారు. మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు త్వరతగతిన వేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తోట రాజేష్ కుమార్, డాక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 : పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డైట్ లెక్చరర్స్, స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సమగ్ర శిక్ష పశ్చిమ గోదావరి జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ సోమవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రంలోపు జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, సమగ్ర శిక్ష, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరానికి పంపించాలని తెలిపారు. దరఖాస్తు వివరాలకు వెస్ట్ గోదావరి.ఏపీఆర్టీ వెబ్‌సైట్ చూడాలన్నారు.

నరసాపురం తెలుగు యువత అధ్యక్షుడిగా పసుమర్తి

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీలో వివిధ అనుబంధ విభాగాల కమిటీల్లో మరికొందరికి స్థానం లభించింది. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటన జారీచేశారు. నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడిగా పసుమర్తి వీరవెంకట లక్ష్మణ వర్మ (తాడేపల్లిగూడెం)ను నియమించారు. వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.దుర్గారావు (చింతలపూడి) నియమితులయ్యారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

ఉంగుటూరు, మార్చి 4: కైకరం పంచాయతీలో సీనియర్ సహాయకుడిగా పని చేయుచున్న మద్ది శేషబాబు జాతీయ రహదారిపై కైకరం శివారులో అదుపు తప్పి పడిపోయాడు. విధి నిర్వహణ అనంతరం ద్విచక్ర వాహనంపై పంచాయతీ కార్యాలయం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న సీనియర్ సహాయకుడు మద్ది శేషబాబు అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దొడ్డిదారి బదిలీల ఉత్తర్వులు సిద్ధం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 4 : కౌన్సెలింగ్ లేకుండా నేరుగా ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలో బదిలీలు తెచ్చుకున్న ఉపాధ్యాయులకు గవర్నమెంట్ ఆర్డర్లు మంగళవారం జారీ అయ్యే అవకాశాలున్నాయి. కొన్ని నెలలక్రితం ప్రభుత్వం నుంచి మూడో జాబితాగా 37 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలతో కూడిన ప్రతిపాదనలు ఆయా స్థానాలకు బదిలీలనిమిత్తం జిల్లాకు అందిన విషయం విదితమే. ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్న పాఠశాలల్లో క్లియర్ వెకెన్సీలు ఉన్నదీ, లేనిదీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను పంపాలని అప్పట్లో ప్రభుత్వం విద్యాశాఖను ఆదేశించింది. అధికారిక ప్రతిపాదనలుగా కాకుండా వీటిని వాట్సాప్ బదిలీలుగా ప్రచారం జరిగాయి. వివిధ కారణాలతో తమను బదిలీ చేయాల్సిందిగా పలువురు రాజకీయ నాయకుల సిఫారసులు, మరికొందరు డబ్బులు ఇచ్చుకుని ప్రజా ప్రతినిధులతో లేఖలు సాధించుకున్నట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇవేవీ లెక్క చేయకుండా బదిలీ ప్రతిపాదనలు చాపకింద నీరులా జరిగిపోతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు, షరతుల ప్రకారం ప్రతిపాదిత జాబితాలో 13 నుంచి 20 మంది టీచర్లకు మాత్రమే గవర్నమెంట్ బదిలీలు దక్కే అవకాశాలున్నట్టు సమాచారం. దీనికి భిన్నంగా ఎవరికైనా బదిలీలు ఇచ్చినా సంబంధిత స్కూలులో క్లియర్ వెకెన్సీ లేకపోతే ట్రెజరీ నుంచి జీతభత్యాలు అందే అవకాశాలు లేకపోవడంతో పరిమిత సంఖ్యలోనే బదిలీ ఆర్డర్లు జారీ చేయనున్నారు. మరోవైపు కొందరికి ఎగైనెస్టు పోస్టుల్లోను బదిలీ అవకాశం కల్పించినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారికంగా ఉమ్మడి జిల్లాలో ఎంతమంది టీచర్లకు గవర్నమెంట్ బదిలీలు జరిగాయన్నది మంగళవారం బహిర్గతమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఎంత మందికి బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలో సీల్డ్ కవర్‌లో ఆర్జేడీల ద్వారా డీఈవో కార్యాలయానికి పంపినట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడంలేదు.

విజృంభిస్తున్న సైబర్ నేరగాళ్లు

- ముదినేపల్లిలో పలువురు బాధితులు లబోదిబో
- ఫిర్యాదు చేసినా చర్యలేవి ?.. రికవరీ కాని సొమ్ము

ముదినేపల్లి, మార్చి 4 : సైబర్ నేరాలకు పాల్పడే ముఠా మాటలు నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో యాప్‌లు జోలికి పోయి మోసపోవద్దని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా డబ్బుల ఆశలో పడి విద్యావంతులు సైతం సొమ్ము పోగొట్టుకుంటున్నారు. ముదినేపల్లిలో ఈ నేరాలు ఆరు నెలల కాలంలో మూడు జరిగాయి. స్థానిక ఆడితీ వ్యాపారి ఒకరు ఒక అపరిచిత వ్యక్తి మాటలు నమ్మి వేరే వ్యక్తి అకౌంట్‌లో ఫోన్ పే ద్వారా ఒక రూపాయి వేయగా, నిమిషాల వ్యవధిలోనే ఆ వ్యాపారి ఖాతా నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసినా గల్లంతైన సొమ్ము తిరిగి రాలేదు. ఈ సంఘటన మరువకముందే ముదినేపల్లిలో కంటి ఆసుపత్రిని నిర్వహించే ఒక విద్యావంతుడు ఆన్‌లైన్ లింకులో సొమ్ములు వేసి సుమారు రూ.2 లక్షలు పోగొట్టుకున్నారు. నాలుగు రోజుల క్రితం తాజాగా మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గత నెల 25న పోస్టు ద్వారా వచ్చిన పార్శిల్‌లో ఒక వ్యాపార సంస్థ నిర్వహించిన షోలో రిజిస్టర్డ్ వ్యక్తులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశామని, ఇందులో స్క్రాచ్ కార్డును ఓపెన్ చేయమని ఉంది. దీంతో పంది మోహనరావు అనే ఆ వ్యక్తి కార్డును ఓపెన్ చేయగా, రూ.15.50 లక్షలు మొదటి బహుమతిని మీరు గెలుచుకున్నారు. టీడీఎస్, ఇతర ఛార్జీల కింద 5 శాతం సొమ్ము చెల్లించాలని బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి రూ.62 వేలు ఇద్దరు వ్యక్తుల ఖాతాలకు పంపారు. అనంతరం అంతకు ముందు మాట్లాడిన వ్యక్తుల ఫోన్ నంబర్లు బంద్ అయ్యాయి. ఇదంతా మోసమని గుర్తించిన మోహనరావు సైబర్ క్రైం పోలీసులకు, ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా పలు రకాలుగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుంటూ కూడా సైబర్ నేరస్థుల మాటలను గ్రామీణ ప్రాంత ప్రజలు నమ్ముతూనే ఉన్నారు. కొన్ని సంఘటనలు బయట పడుతుండగా బయటపడనివి ఎన్నో. ఈ మోసాలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లు ఇతర రాష్ట్రాలకు చెందినవిగా కొన్ని కేసుల్లో బయట పడినప్పటికీ సైబర్ క్రైం విభాగం సొమ్మును తిరిగి రాబట్టే అవకాశాలు లేకుండా పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు కూడా సైబర్ మోసాలు వ్యాపించటం ఆందోళన కలిగిస్తున్నది.

● నమ్మి మోసపోయా



ముదినేపల్లిలోని తన అడితికి వచ్చి నాపరాయి కొనుగోలు చేసినట్లు ఇద్దరు వ్యక్తులు నటించారు. ఒక రూపాయి తమ యజమాని అకౌంట్‌కు ఫోన్ పే చేస్తే సరుకు కొన్న మొత్తం వేస్తారు. అని వారు నమ్మించారు. నేను నా ఫోన్ ద్వారా ఒక రూపాయి వేయగా, పది ని ముషాల్లో నా బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.69 వేలు మాయమయ్యాయి. ఇది జరిగి ఆరు నెలలు గడిచింది. సొమ్ము తిరిగి నాకు దక్కలేదు.

- కోడె వెంకటస్వామి, టింబర్ డిపో యజమాని

● ప్రైజ్ మనీ పేరిట మోసం



ఆన్‌లైన్ యాప్‌లో వస్తువులు, పిల్లల డ్రెస్సులు ఆర్డర్ పెట్టా. వస్తువులు డెలివరీ అయ్యాక సొమ్ము చెల్లించా. అనంతరం లక్కీ డ్రాలో ప్రైజ్ మనీ వచ్చిందంటే నమ్మి టీడీఎస్ ఛార్జీల నిమిత్తం రూ.62 వేలు బ్యాంక్ అకౌంట్‌లో వేశా. గత నెల 26న రూ.15 లక్షలు ఇండియన్ బ్యాంకు నా అకౌంట్‌లో వేశామని ఆ యాప్ నిర్వాహకులు ఫోన్ చేయగా, బ్యాంక్‌కు వెళ్లి చూశాను. అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. చిన్న రైతునైన నేను కష్టపడిన సొమ్ము పొగొట్టుకున్నా.

- మోహనరావు, సైబర్ క్రైం బాధితుడు, ఊటుకూరు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 4 : ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని సాయుధ బలగాలతో పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయుధ దళాధిపతులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నియమాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీతో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎం శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, టూటౌన్ సీఐ ప్రభాకర్, ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరులో పోలీసుల మార్చ్‌ఫాస్ట్

మొగల్తూరు, మార్చి4: రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ సూచించారు. సోమవారం మొగల్తూరు ప్రధాన వీధుల్లో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు, భయాందోళనకు గురి కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్లకు మనోస్థైర్యం కల్పించేందుకే మార్చ్‌ఫాస్ట్ నిర్వహించామన్నారు.సీఐఎస్ఎఫ్ కమాండెంట్ జర్నాల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామన్‌జీ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ కె.వెంకట రమణ, తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ పోలీసులు

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, మార్చి 4 : రైలు నుంచి జారిపడి ఒక యువకుడు ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు స్టేషన్ దాటిన తరువాత పట్టాలపై ఒక యువకుడి మృతదేహం ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తెనాలిలోని గంగానమ్మపేట ముస్లిం వీధికి చెందిన నరిశెట్టి సాయిరామ్(27)గా గుర్తించారు. అతను వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చెరువులో పడి యువకుడి మృతి

పెదపాడు, మార్చి 4 : కొణికిలో చేపల చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందినట్టు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పోలీసుల వివరాలివి.. పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ అమీర్ ఆలీ కొంతకాలంగా కొణికిలో చేపల చెరువుల మీద నివాసముంటున్నాడు. రెండు నెలల క్రితం కొణికి వచ్చిన షారుఖ్ షేక్ (16) అన్నయ్యతో కలిసి ఉంటున్నాడు. సోమవారం చెరువులో పడి మృతి చెందాడన్న సమాచారంతో పెదపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్న ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుల పింఛన్ డబ్బులు కాజేసిన వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

తణుకు, మార్చి4: పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఈ నెల 1న వృద్ధులకు మాయమాటలు చెప్పి పింఛన్ డబ్బులు కాజేసిన వ్యక్తిని అరెస్టు చేశామని, సీఐ ఎం.నాగరాజు తెలిపారు. సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు నాగూర్ మీరావల్లి అనుమానాస్పదంగా కనిపించడంతో అరెస్టు చేశామన్నారు. కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన షేక్ నాగూర్ మీరావల్లి వృద్ధులకు పింఛన్ అధికంగా ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి వారి నుంచి తొమ్మిది వేలు కాజేసినట్టు వివరించారు. అతడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సుమారు 46 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడన్నారు. ఏటీఎం కార్డుల మార్పిడి, బ్యాంకు ఖాతాదారులకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేయడం, ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలు వంటి నేరాలలో నిందితుడని వివరించారు. 2011 నుంచి పలుమార్లు జైలుకు వెళ్లినా అతనిలో మార్పు రాలేదన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఈ నెల 13న విడుదలైనట్లు చెప్పారు. ఎస్ఐలు పి.అప్పారావు, కె.శ్రీనివాసు, పీసీలు ప్రసాదు, ఉదయకుమార్, మురళి, వీర్రాజులను ఆయన అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత



చింతలపూడి, మార్చి 4:యర్రగుంటపల్లిలో కఠారి వాణి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తమకు వచ్చిన సమాచారంతో బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు పంపి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అత్తిలి : రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు కె.సముద్రపు గట్టు వద్ద ఏపీ 37 టీడీ 1498 నెంబరు మహేంద్ర ఆల్ఫాప్లస్ వాహనంలో తరలిస్తున్న 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్సు, రెవెన్యూ పౌరసరఫరా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కొత్యాల అనిల్‌కుమార్‌ను అధికారులు ప్రశ్నించగా రేషన్ బియ్యం, వాహనం అత్తిలికి చెందిన ఇర్రి గౌరీ శంకర్‌కు చెందినవని తెలిపారు. రేషన్ బియ్యాన్ని కార్డుదారుల వద్ద కిలో రూ.20కు కొనుగోలు చేసి తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన బాషాకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిపారు. రూ.44 వేల బియ్యాన్ని, లక్షా 20 వేల వాహనం సీజ్ చేసి ఇర్రి గౌరీశంకర్, కొత్యాల అనిల్‌కుమార్, బాషాలపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, అత్తిలి సీఎస్డీటీ టి.సుబ్రమణ్యం, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.


పాలకొల్లు టౌన్: పాలకొల్లు పట్టణం, పోడూరు మండలంలో సోమవారం ఏలూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు అక్రమ రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పాలకొల్లు పట్టణం ఎల్‌ఆర్‌పేట రెండో వీధిలో తాడికొండ వెంకట కృష్ణారావు అక్రమంగా నిల్వ ఉంచిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కవిటం లాకుపేట గ్రంధి కేశవ కనకం దుకాణంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరి ఇద్దరి మీద 6ఎ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో సురేష్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉక్కపోతలు.. విద్యుత్ కోతలతో విలవిల

ఏలూరుసిటీ, మార్చి 4: జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతల వల్ల ప్రజలు విలవిలలాడుతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ వినియోగం భారీగానే పెరుగుతోంది. ఏప్రిల్‌లో వచ్చే విద్యుత్ వినియోగం ఇప్పుడే నమోదయ్యింది. మార్చిలోనే ఎండలు మండుతుండటంతో విద్యుత్ కోతలు అప్పుడే మొదలయ్యాయి. దీంతో వృద్ధులు, పిల్లలు ఉక్కబోత, దోమల బెడద తట్టుకోలేక నానా అవస్థలు పడు తున్నారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్:

ఉమ్మడి పశ్చిమలో మార్చిలో సాధారణంగా కొంచెం తక్కువగానే విద్యుత్ వినియోగం ఉంటుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జిల్లాలో రోజువారీ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. విద్యుత్ కోటాకు, వినియోగానికి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో విద్యుత్ అంతరాయాలు తప్పటం లేదని అధికారులు చెబుతున్నారు. వేడిగాలులు, ఎండల తీవ్రత కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.



తేదీ	విద్యుత్ కోటా	వినియోగం
1-3-2024	24.536	22.843
2-3-2024	22.697	23.136
3-3-2024	22.411	22.869



వీరవాసరంలో మార్చ్‌ఫాస్ట్

వీరవాసరం, మార్చి 4: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించటమే లక్ష్యంగా ప్రజల్లో నమ్మకం కలిగించటానికి సాయుధ బలగం బృందంతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నామని భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ప్రజలందరికీ పోలీసులు వెళ్ళవేళలా తోడు ఉంటారని తెలియజేయటానికి, ధైర్యాన్ని కల్పించటానికి వీరవాసరంలో సోమవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ వై.సత్యకిషోర్, ఎస్‌ఐలు పి .రమేష్, నాళం శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ ధర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకే, వాటర్ ప్లాంట్‌ల ప్రారంభం

ఆచంట, మార్చి 4: వల్లూరులో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్ ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన రైతు భరోసా, హెల్త్ కమ్ వెల్‌నెస్ వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నరసాపురం రూరల్, మార్చి 4: చిట్టవరంలో సోమవారం పలు అభివృద్ధి పనుల్ని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. సీసీ రహదారులు, మంచినీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముదునూరి మాట్లాడుతూ గ్రామాల్లో నూరుశాతం సమస్యల్ని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

కాళ్ళ: ఏలూరుపాడు గ్రామంలో రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథ రాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీటీసీ చిన్నారపు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: పట్టణంలో మూడు కోట్ల 25 లక్షల రూపాయలతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆరో వార్డు గాదిరాజువారి వీధిలో పేదలకు పంపిణీ చేసిన స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలను ఆయన పంపిణీ చేశారు. రెండో వార్డులో వైసీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, రెండో పట్టణ జేసీఏ కన్వీనర్ ఏఎస్ రాజు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

8న రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ లిస్టులు

నరసాపురం రూరల్, మార్చి 4: ఈనెల 8న సబ్‌డివిజన్ పరిధిలోని నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ తుది జాబితా అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. ఇప్పటికే 1 నుంచి 3 తేదీల్లోపు అన్ని రైతుభరోసా కేంద్రాల్లోని రైతుల ఈ-క్రాప్ లిస్టుల జాబితాలో తప్పులు, ఒప్పులు ఉంటే గ్రామ సభల ద్వారా గ్రీవెన్స్‌లో పొందుపర్చామన్నారు. 5లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి తహసీల్దార్ లాగిన్‌లో మంజూరు అయిన తరువాత రైతు భరోసా కేంద్రాల్లో లిస్టులు పెడతామన్నారు. కావున రైతులు జాబితాలను పరిశీలించుకోవాలని ఆమె కోరారు.

స్పందనలో ఎనిమిది అర్జీలు

ఆకివీడు, మార్చి 4: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎనిమిది అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకర్, తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని వినతి

ఆకివీడు, మార్చి 4: పట్టణ పరిధిలో డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు సిద్ధాపురం ప్రజలు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి వెళుతున్న ఆయనకు సోమవారం సిద్ధాపురం వైపువెళ్ళు రహదారిలో ఉన్న అనధికార డంపింగ్ యార్డు వద్ద ఆపి డంపింగ్ రోడ్‌మీద వేసి అంటించడంతో పొగ, దుర్వాసనతో తామంతా అనారోగ్యం బారిన పడుతున్నామని తెలిపారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కరించాలని ఆయనను కోరారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గణపవరం, మార్చి 4: చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆర్‌ఐవో కే చంద్రశేఖర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 278 మందికి 270 మంది హాజరైనట్టు, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఆర్‌ఐవో పరీక్ష కేంద్రం వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు ఆర్‌ఐవో కమిటీ సభ్యుడు రాజ్‌కృష్ణ, ప్రిన్సిపల్ ఉప్పలపాటి రామచంద్రరాజు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం

గణపవరం, మార్చి 4: ధ్యానంతో ఏకగ్రత సాధ్యమని లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టార్లు పెరుమాళ్ళ మురళీకృష్ణ, పెరుమాళ్ళ మహాలక్ష్మి అన్నారు. సోమవారం గణపవరంలోని లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యోగాపై అవగాహన నిర్వహించారు. నిత్యం జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించి మానసిక ప్రశాంతత ఉండాలంటే యోగా ఒక్కటే మార్గమని వారు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు యోగా సాధన చేయాలని సూచించారు.

టీడీపీ నేత తాడి ప్రభాకర్‌రావు మృతి



యలమంచిలి, మార్చి 4: ఆర్యపేట గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాడి శశిధర్ తండ్రి తాడి ప్రభాకర్‌రావు(59) సోమవారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారు. ప్రభాకర్‌రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ప్రభాకర్‌రావు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ నాయకులు పెచ్చెట్టి బాబు, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, పీతల శ్రీను, మాజీ జడ్పీ చెర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు సంతాపం వ్యక్తం చేశారు.

పోస్టల్ బీమా సొమ్ము రూ. 2 లక్షలు అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4: నందమూరుకు చెందిన కండెల్లి గంగమ్మ మృతి చెందగా ఆమె నామినీకి గ్రామీణ తపాలా బీమా సొమ్ము రూ.2లక్షల అందించారు. నామినీ కె బేబి రాణికి నిడదవోలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ. శివకృష్ణ, డెవలప్‌మెంట్ అధికారి పి. గోపి సోమవారం అందించారు. 15 నెలల వ్యవధిలో రూ.19వేలు ప్రీమియం చెల్లించగా రూ.2 లక్షల 17వేల 930 అందించామన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కలెక్టర్‌కు వినతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 4: రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర ప్రయోజనాలు వచ్చేలా చూడాలని తాడేపల్లిగూడెంకు చెందిన కోసంపూడి విజయ్ సోమవారం భీమవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణంతోపాటు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని కోరారు.

వీఆర్‌ఏలకు పోలీసుల నోటీసులు

ఆకివీడు, మార్చి 4: చలో విజయవాడకు వెళ్ళకుండా మండలంలో నల్గురు వీఆర్‌ఏలకు సోమవారం నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు. వెళ్ళడానికి అనుమతులు లేనందున నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ఇంగ్లీషు పరీక్ష



ఆకివీడు, మార్చి 4: ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీషు పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కార్తికేయ జూనియర్ కళాశాల, దుంపగడప ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలలో సోమవారం జరిగిన పరీక్షకు 834 మంది విద్యార్థులకు గాను 66 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, కస్టోడియన్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



దువ్వలో ఆరిమిల్లికి సత్కారం.. ముద్దాపురంలో పూలతో స్వాగతం



పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ప్రచారం.. గొల్లలకోడేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంతెన..

జగన్ పాలనలో ఏదీ అభివృద్ధి

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల విస్తృత ప్రచారం

పాలకొల్లు టౌన్, మార్చి 4 : జగన్ పాలనలో పాలకొల్లు నియోజకవర్గం అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు 27వ వార్డులో సోమవారం మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో పాటు టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వైసీపీ నాయకులకు నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని విమర్శించారు. జగన్ అరాచకాలకు చరమగీతం పాడే సమయం వచ్చిందన్నారు. రానున్న టీడీపీ జనసేన కూటమి ప్రభుత్వంలో పాలకొల్లును అన్ని విధాలా అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, వార్డు మాజీ కౌన్సిలర్ వీర వెంకటరమణ, కార్యదర్శి తోట వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు శిద్దిరెడ్డి అప్పారావు, బోనం వెంకట నరసయ్య చినబాబు, శిడగం సూరి, పినిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంతోపాటు మీ పిల్లల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ పేర్కొన్నారు. చినతాడేపల్లిలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. కరపత్రాల పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్, తెలుగు రైతు జిల్లా నాయకులు పాతూరి రాంప్రసాద్ చౌదరి, పరిమి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి : మంతెన

పాలకోడేరు, మార్చి 4: వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. పాలకోడేరు మండలంలో సోమవారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో 14 గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తనకు మరోమారు అవకాశం కల్పించారని ప్రజలు తనపై విశ్వాసం ఉంచి మరోసారి అవకాశం కల్పించాలన్నారు. ఉండి నియోజకవర్గం టీడీపీ నాయకులు, జనసేన ఉండి ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు, కామన రాంబాబు, మండల అధ్యక్షుడు కోటిరాజు, కొత్తపల్లి నాగరాజు, మోగల్లు బాబు, గాదిరాజు శ్రీనివాసరాజు, సంకురుడు, కమ్మిలి రాంబాబు, జనసేన నాయకులు గవర లక్ష్మీ, విజయ్‌కుమార్, సత్యకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.



తణుకులో మాట్లాడుతున్న జనసేన నాయకులు

వైసీపీ ఓటమి ఖాయం: ఆరిమిల్లి

తణుకు, మార్చి 4: రాష్ట్రంలో వైసీపీ ఓటమి ఖరారైందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం రేపటి కోసం సకల జనుల చైతన్య పాదయాత్ర తణుకు మండలం కోనాలలో ప్రారంభించారు. గ్రామస్థులు, టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు. మహిళలు హారతులు, పువ్వులు చల్లి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ తణుకులో టీడీపీ ప్రభంజనం ఖాయమని, ఇందులో భాగంగా పెద్ద ఎత్తున పార్టీలో చేరికలు జరుగుతున్నాయని వివరించారు. పాదయాత్రలో గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇప్పటికే అత్తిలి మండలంలో 80 కిలోమీటర్లు, ఇరగవరంలో 80 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేశానని చెప్పారు. కోనాలలో ప్రారంభమైన పాద యాత్ర ముద్దాపురం, సాయంత్రం దువ్వకు చేరింది. దువ్వ లో జనసేన నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆరిమిల్లిని సత్కరించారు. పలువురు వైసీపీకి చెందిన యువకులు ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరారు. రాత్రికి బీసీ కాలనీలో పల్లె నిద్ర చేశారు. మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, పార్టీ నాయకులు గుబ్బల శ్రీనివాసు, కొండేటి శివ, పితాని మోహన్, జనసేన మండల అధ్యక్షుడు చిక్కాల వేణు, దేవళ్ళ కృష్ణమోహన్, బూరుగుపల్లి ఆనంద రమేష్, వల్లభనేని వీరాస్వామి, ముళ్ళపూడి శ్రీనివాసరావు, మట్టా వెంకట్, కట్టా సూర్యారావు, బొరుసు సత్యనారాయణ పాల్గొన్నారు.

'డబుల్ గేమ్ ఆడుతున్న విడివాడ'

తణుకు, మార్చి 4 : తణుకు ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ గెలుపు తథ్యమని జనసేన నాయకుడు అనుకుల రమేష్ అన్నారు. సోమవారం తణుకులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'విడివాడ రామచంద్రరావు ఆడుతున్న డబుల్ గేమ్‌ను ప్రజలకు వివరిస్తాం. ఆయన ఏ పార్టీలో పనిచేస్తే ఆ పార్టీకి వెన్నుపోటు పొడుస్తుంటారు. 2014లో వైసీపీలో సీటు రాకపోతే ఆ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశాడు. 2019లో జనసేన సీటు దక్కకపోవడంతో వైసీపీ తరపున కారుమూరితో కలిసి చీకటి రాజకీయాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిదే అధికారమన్నారు. నాయకులు కాట్నం విశాలి, పోతుల గంగాధర్, రుద్ర సతీస్, కాకర్ల మధురవాణి, కాకర్ల అమరజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడే జయహో బీసీ సదస్సు

గుంటూరు జిల్లా కాజ సభకు భారీగా తరలి రావాలని పిలుపు

భీమవరం అర్బన్, మార్చి 4 : గుంటూరు జిల్లా కాజ గ్రామంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కళ్యాణ్‌లతో నిర్వహించే జయహో బీసీ రాష్ట్ర సభను బీసీలంతా జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ కోరారు. తెలుగుదేశం పార్టీ బీసీ ముఖ్యనాయకుల సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆ మహాసభలో వెనుకబడిన తరగతుల కులాల బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, పట్టణ, మండల నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, మహిళానాయకులు ఎండీ షబీనా, మెరగాని నారాయణమ్మ, మైలా బత్తుల ఐజాక్‌బాబు, ఎండీ నౌషాద్, పామర్తి వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంగళవారం గుంటూరు జిల్లా కాజలో జరిగే జయహో బీసీ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీసీ నేతలు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తాళం శ్రీనివాస్, దొంగ గవరయ్య, నరాలశెట్టి వెంకటేశ్వరరావు, కేతా మీరయ్య, సానబోయిన గోపాలకృష్ణ, బాలం వెంకట రమణ, కేతా మురళి, పీవీరావు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తర్వాతనే బీసీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, బీసీ సంఘాల నాయకుడు పెచ్చెట్టి బాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో చంద్ర బాబు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పరిచారన్నారు. టీడీపీ బీసీ జయహో సదస్సుకు పాలకొల్లు నియోజకవ ర్గం నుంచి వేలాదిగా తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, యల మంచిలి, పాలకొల్లు మండలాల టీడీపీ అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్, అందే కోటి వీరభద్రం, గుడాల ప్రసాదు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

భీమవరం, మార్చి 4: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల కలసి జిల్లాలోని నియోజకవర్గ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 1461 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో ఇప్పటికే గుర్తించిన వల్నరబిలిటీ, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాలను ముందుగా క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. క్రిటికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం

భీమవరం, మార్చి 4 : రానున్న ఎన్నికలలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకమైనదని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల సెక్టార్ అధికారులతో కలెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు తెలుసుకొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.సెక్టార్ అధికారుల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను ఒకటికి, రెండుసార్లు పరిశీలించుకుని సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్‌లకు చేరుకోడానికి బస్సు రూట్ మార్గాన్ని నిశితంగా పరిశీలించుకోవాలని, అదే మార్గంలో రాకపోకలను కొనసాగించాల్సి ఉంటుందని ఇందులో మార్పుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఆరు రోజులు ముందు సెక్టార్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్స్ బదలాయింపు చేస్తా మని తెలిపారు. వారి సెక్టార్ పరిధిలో కొన్ని స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి మెజిస్ట్రేట్ పవర్స్ ఉపయోగపడతాయన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్. అప్పారావు, తణుకు పురపాలక సంఘం కమిషనరు బి.వెంకట రమణ, తణుకు తహసీల్దారు బి.యం.ముక్తేశ్వర రావు, ఎలక్షన్ సూపరింటెండెంటు సి.హెచ్.దుర్గా ప్రసాదు, డిప్యూటీ తహసీల్దారు యం.సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉండి, మార్చి 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులంతా నిరంతరం అప్రమత్తంగా వుండాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఉండిలో ఉండి, ఆకివీడు తహసీల్దార్లు, ఎంపీడీవో, ఈవోపీఆర్‌డిలు, మున్సిపల్ కమిషనరు, టౌన్‌ప్లానింగ్ అధికారి తదితరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉండి నియోజకవర్గానికి సంబంధించి విష్ణు కాలేజీలో కౌంటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు వారి ఖర్చులు నివేదికలు మూడు సార్లు పరిశీలకులకు చూపించాల్సి వుంటుందన్నారు.

డాక్టర్ జగపతిరాజుకు అవార్డు



భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 : ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజుకు హైదరాబాద్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం డైరెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డి చక్రపాణి, ఎస్‌ఆర్‌ఎస్‌సి మాజీ డైరెక్టర్ పద్మశ్రీ బిఎల్ దీక్షితులు, హైద్రాబాద్ కేర్ హాస్పిటల్ గైనకాలజిస్టు క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, జనగామ ఎమ్మెల్యే డా.పి రాజేశ్వరరెడ్డి వంటి ప్రముఖుల సమక్షంలో తనకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారని తెలిపారు.

విట్ విద్యార్థుల ప్రతిభ

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 4 : విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డా.జీవీవీ రావు యంగ్ ఇంజనీర్ డ్రీమర్ అవార్డ్స్ 2023 పేపర్ ప్రెజంటేషన్‌లో మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేల నగదు బహుమతిని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ విద్యార్థులు సాధించారని విట్ ప్రిన్సిపాల్ డా.మంగం వేణు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొత్తం 70 టీమ్స్ పాల్గొన్నాయని, ఫైనల్స్‌కు 6 టీమ్స్ అర్హత సాధించాయన్నారు. తమ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు యూటిలిజేషన్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్స్ ఫర్ ప్రీకాస్ట్ బిల్డింగ్ కంపోనెంట్స్ అనే అంశంపై మొదటి బహుమతి, ట్రాన్స్‌ఫార్మింగ్ ప్లాస్టిక్ వేస్ట్ ఇన్ టు ఫ్యూయల్ అండ్ పవర్ బ్లాక్స్ అనే అంశంపై ద్వితీయ బహుమతి గెలుపొందారన్నారు.

వలంటీర్లకు సత్కారం

అత్తిలి, మార్చి 4 : వలంటీర్లు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోరారు. అత్తిలిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. నర్సాపురం పార్లమెంటు వైసీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వలంటీర్ల సేవలు ఎంతో ముఖ్యమన్నారు. ఏఎంసీ ఛైర్మన్ భరణి ప్రసాద్, జడ్పీటీసీ అడ్డాల జానకి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నిజం చేశాం

అత్తిలి, మార్చి 4 : తమ ప్రభుత్వం పేదవాడి సొంతింటి కలను నిజం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలిలో మండలానికి చెందిన ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. అత్తిలిలోనే 786 మందికి ఇళ్ల పట్టాలు అందజేసినట్టు తెలిపారు. మండలంలో 2750 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ భరణి ప్రసాద్, జడ్పీటీసీ అడ్డాల జానకి, మండల వైసీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

40 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

మొగల్తూరు, మార్చి 4: పల్స్ పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు 40 మందికి సోమవారం ఇంటింటా తిరిగి పోలియో చుక్కలు వేసినట్టు మొగల్తూరు పీహెచ్‌సీ వైద్యులు దినేష్ తెలిపారు. మండలంలో 0 నుండి 5 సంవత్సరాలు వయస్సు కలిగిన చిన్నారులు 5531 మంది ఉండగా వారిలో ఆదివారం 5397 మందికి పోలియో చుక్కలు అందించామన్నారు. మిగిలిన 134 మందిలో సోమవారం 40 మంది చిన్నారులు అందుబాటులో ఉండటంతో వారి ఇళ్ళకు వెళ్ళి పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు.

సుపరిపాలన ప్రభుత్వ లక్ష్యం



సిద్ధాపురంలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు రూరల్ మార్చి 4 : గ్రామాలలో సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సిద్ధాపురం, చినిమిల్లిపాడు, గుమ్ములూరు గ్రామాలలో సచివాలయాలను ప్రారంభించారు. ఆకివీడు-చినిమిల్లిపాడు రహదారికి రూ.25కోట్లు సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు అవ్వడంతో రహదారి పనులకు చినిమిల్లిపాడులో శంకుస్థాపన చేశారు. సిద్ధాపురంలో హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. సర్పంచ్‌లు చిట్టిబాబు, గురుదాసుసీత, ఉపసర్పంచ్ నారాయణరాజు, ఎంపీటీసీలు కిల్లి రామకృష్ణ, బొడ్డుపల్లి రోహిణీలను అభినందించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహ రాజు, జడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మోటుపల్లి గంగాధరరావు, అంబటి రమేష్, పుప్పాల పండు, గుంట వెంకటేశ్వరరావు, తహసీల్దారు వెంకటేశ్వరి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో ప్రియాంక పాల్గొన్నారు.

అర్జీదారులకు రెడ్‌క్రాస్ అల్పాహారం

భీమవరం, మార్చి 4 : స్పందన అర్జీదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న అల్పాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు సుమిత్ కుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల అల్పాహారం, మజ్జిగను స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు జిల్లా కలెక్టరు చేతుల మీదుగా స్వయంగా అందజేశారు. రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డా.రామ భద్రి రాజుని, సిబ్బందిని జిల్లా కలెక్టరు అభినందించారు.

గుర్తింపు కార్డుల అందజేత

ఇండియన్ రెడ్ క్రాస్ జీవితకాల సభ్యత్వం గుర్తింపు కార్డులను అధికారులకు కలెక్టరు అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఏర్పడిన తరువాత వివిధ శాఖల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సభ్యత్వం నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగిందని, రాష్ట్ర గవర్నరు చేతులు మీదుగా బంగారు పతకం అందుకోవడం అభినంద నీయం అన్నారు. భవిషత్‌లో మరెన్నో బంగారు పతకాలు మన జిల్లాకు తీసుకురావలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షుడు డా.రామభద్రి రాజు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 18 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం క్రైం, మార్చి 4 : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులలో మహిళలు, వృద్ధులకు సంబంధించి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం స్పందన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 18 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. వరకట్న వేధింపులు, సరిహద్దు తగాదాలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఫిర్యాదులన్నింటిపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్పందన ఫిర్యాదుదారులకు కార్యాలయంలో భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూబీఐ ర్యాలీ

భీమవరం, మార్చి 4 : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో జేపీ రోడ్డులో ఉన్న యుబీఐ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు మహిళాఖాతాదారులు, మహిళా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అరుణోదయ మనో వికాస కేంద్రానికి ఇన్వర్టర్‌ను అందించారు. కార్యక్రమంలో రీజనల్ అధికారులు సంగీత కుమారి, దివాకర్, ఎస్ఎస్ఎ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

భీమవరం టౌన్, మార్చి 4 : ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలని భీమవరం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శెట్టి గురవయ్య అన్నారు. పట్టణానికి చెందిన మెరుగు జాన్ రాజు రోడ్డు ప్రమాదం చనిపోయారన్నారు. వ్యక్తి గత బీమా పథకంలో వెయ్యిరూపాయలు చెల్లించి పేరు నమోదు చేసుకున్నారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకపోవటంతో గునుపూడి ఎస్‌బీఐ మేనేజర్, రీజనల్ బిజినెస్ డెవలప్ మెంట్ అధికారులు వ్యక్తిగతంగా నామినీ కుసుమకు క్లెమ్ చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చెక్కును అందించామన్నారు.

వివాహిత అదృశ్యం

ఉండి, మార్చి 4: మహదేవపట్నం గ్రామానికి చెందిన 28 సంవత్సరాల వివాహిత భర్తతో విభేదాలు కారణంగా పుట్టింట్లోనే వుంటుంది. ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తల్లి పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.